# టిడ్కో గృహాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్
వీఎం లక్ష్మీపతిరావు


మహిళల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు

**తెనాలిఅర్బన్:** టిడ్కో గృహాల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. మంగళవారం పెదరావూరు సమీపంలోని టిడ్కో నివాస గృహాలను ఆయన పరిశీలించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదనపు పైపును ఏర్పాటు చేయడం వలన నీటి దారా తక్కువగా వస్తుందని, ఎక్కువ వచ్చే విధంగా చూడాలని మహిళ కోరారు. వెంటనే అదనపు పైపును తొలగించాలని ఆదేశించారు. అలాగే ఒక అరగంట అదనంగా నీరు సరఫరా చేయాలని సూచించారు. అనంతరం పట్టణంలోని పలు వార్డులలో పర్యటించి అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

# వ్యాధులతో అప్రమత్తంగా ఉండండి

వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక


మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక

**తెనాలిఅర్బన్:** దోమ కాటు వలన విషజ్వరాలు, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నందులపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక సూచించారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిరా మున్సిపల్ బాలుర హైస్కూల్‌లో మంగళవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి నిల్వలు ఎక్కువగా ఉన్న చోట్ల దోమలు గుడ్లు పెడతాయని చెప్పారు. గుడ్ల ద్వారా దోమల వ్యాప్తి పెరుగుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మలేరియా తెనాలి పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ 2027 నాటికి దేశంలో మలేరియాను నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ప్రధానోపాధ్యాయులు తోటకూర రాఘవయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.స్వప్న, సూపర్‌వైజర్లు దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, షేక్ రషీద్, సయ్యద్ కరిముల్లా, సంకా శరత్, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కొల్లిపర విద్యార్థికి ట్రిబుల్ ఐటీలో స్థానం



**తెనాలి టౌన్:** కొలకలూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి నూజవీడు ట్రిబుల్ ఐటీలో సీటు సాధించాడు. సోమవారం వెలువడిన ఫలితాల్లో కొలకలూరు గ్రామానికి చెందిన పొన్నెకంటి ధనుష్‌కి సీటు సాధించడం పట్ల తల్లిదండ్రులు మరియదాసు, రూప కుమారునికి స్వీట్ తినిపించి అభినందనలు తెలిపారు. ధనుష్ భవిష్యత్‌లో ఇంజినీరుగా విద్య పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని తన లక్ష్యంగా తెలిపారు. విద్య అందించిన ఉపాధ్యాయులకి కృతజ్ఞతలు తెలిపారు.

### పాఠశాలకు టేబుల్స్ వితరణ



**తెనాలిఅర్బన్:** రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఐతానగర్‌లోని జెట్టి వెంకట రత్తయ్య, నరసమ్మ మున్సిపాల్ ఎలిమెంటరీ స్కూల్‌కు మంగళవారం రెండు ఐరన్ టేబుల్స్‌ను ఉచితంగా ఇచ్చారు. అలాగే విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి డి.మురళీకృష్ణ, నాయకులు పావులూరి రాంబాబు, కె.ఉపేంద్ర, ఆలపాటి కిరణ్, వీరవల్లి శ్రీధర్, మల్లాది అర్జునరావు, ఈదర వెంకట పూర్ణచంద్, ప్రధానోపాధ్యాయులు సునీత, తదితరులు పాల్గొన్నారు.

### యాజమాన్యానికి జీవితాలు ధారపోశారు



**తాడేపల్లి రూరల్:** ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీకార్మికులు తమ జీవితాలను యాజమాన్యానికి ధార పోశారని, అయినా యాజమాన్యం కార్మికుల సమస్యను పరిష్కరించడం లేదని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలియజేసి మాట్లాడారు. కార్యక్రమంలో రమణమ్మ, సువర్ణకుమారి, శారద, రమాదేవి, కాసమ్మ, సాంబశివరావు, ఆశీర్వాదం, సూర్యప్రకాశరావు, నాగేశ్వరరావు, గురవయ్య, పిచ్చయ్య, సుభాని తదితరులు పాల్గొన్నారు.

### చలో తెనాలిని జయప్రదం చేయాలి



**తాడేపల్లి రూరల్:** ఈనెల 28న నిర్వహించనున్న చలో తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గురోడ్డులో చలో తెనాలి కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెనాలి పట్టణంలో పోలీసు అధికారులు నడిరోడ్డుపై దళిత యువకులపై చేసిన అరాచకాన్ని నిరసిస్తూ నిర్వహించనున్న చలో తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో దర్శనపు విజయ్ బాబు, కె.బాబూరావు, కేవీపీఎస్ నాయకులు శ్యామ్, నాని, ఏసోబు, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్

**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటలో పైప్‌లైన్ లీకేజీపై సాక్షిలో మంగళవారం 'తాగునీరు.. రోడ్డుపాలు!' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా సమస్యపై స్పందించి పైప్‌లైన్ లీకేజ్ అయ్యే దగ్గర మరమ్మతులు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో తాడేపల్లి ఇంజినీరింగ్ సిబ్బంది పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించి తాగునీరు లీక్ కాకుండా అరికట్టారు.

# ట్రిపుల్ ఐటీకి తొమ్మిది మంది ఎంపిక

**కొల్లిపర:** మండలంలో వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 2024–25 సంవత్సరంలో 10వ తరగతి పరీక్షలో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్రంలో ఉన్న ట్రిపుల్ ఐటీలో ఉన్నత చదువుల నిమిత్తం తొమ్మిది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించినట్లు ఎంఈవో–1 సాల్మన్ రాజు తెలిపారు. మంగళవారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కొల్లిపర హైస్కూకు చెందిన గరిక విష్ణుప్రియ కావేరి, ఎ.లోకేశ్వరి నూజివీడు క్యాంపస్. మున్నంగి హైస్కూల్‌కు చెందిన చొక్కా జీవన, నలుకుర్తి సుచరిత నూజివీడు క్యాంపస్, మున్నంగి మహిమ, చొప్పర భానుప్రసాద్ ఒంగోలు క్యాంపస్, అత్తోట హైస్కూల్‌కు చెందిన లంకపల్లి పూజిత ఇడుపులపాయ కడప క్యాంపస్, వల్లభాపురం హైస్కూల్‌కు చెందిన తియ్యగూర పూజిత రెడ్డి నూజివీడు క్యాంపస్, తూములూరు హైస్కూల్ కు చెందిన పి.మోహన్ నాగ సాయి ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో–2 ఝాన్సీలత, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ ఎం,రమేష్ , సీఆర్పీ పిడపర్తి రమేష్ బాబు, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయలు, ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

# పేకాట శిబిరంపై పోలీసుల దాడి

**తెనాలిరూరల్:** పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్ బాబు వెల్లడించిన వివరాల ప్రకారం పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డులో పేకాడుతున్నారని పోలీసులు మంగళవారం పక్కా సమాచారం వచ్చింది. ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారని గుర్తించి ఆకస్మిక దాడులు నిర్వహించి 11 మంది జూదరులను అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి రూ. 23,300 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# భూసార పరీక్షలు తప్పనిసరి


రైతులతో మాట్లాడుతున్న ఏవో శ్రీనివాస్‌రెడ్డి

**కొల్లిపర:** రైతులు భూసార పరీక్షలు తప్పక చేయించుకోవాలని వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్నవరం, హనుమాన్ పాలెం పంచాతీయలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు ఉపయోగం, పంటలు సాగు చే స్తే రైతులు ఆశించిన దిగుబడి సాధించవచ్చనారు. కౌలు రైతులు కూలు కార్డుల కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రధాని మంత్రి ఫసల్ బీమా కింద వరి ఎకరానికి రూ.800 రూపాయలు, మినుము పంట ఎకరానికి రూ.200 రూపాయలు ఆగస్టు 15వ తారీకు లోపల రైతులు చెల్లించి ఇన్సూరెన్స్ చేయించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు పరుపులు అందజేత


అంగన్‌వాడీ సెంటర్‌కు పరుపులు అందజేస్తున్న దాతలు

**మంగళగిరి టౌన్:** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు భోజనం చేసిన తరువాత కొద్దిసేపు సేదతీరేందుకు సేవా దృక్పథంతో పరుపులు ఇవ్వడానికి దాతలు ముందుకు వచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని శాలివాహన నగర్‌లోని అంగన్‌వాడీ ప్రీస్కూల్‌కు మంగళవారం మూడు పరుపులను పట్టణానికి చెందిన దాతలు మంచా కుమార్, మాసన దంపతులు తమ బాబు ఈశ్వర్ పేరుపై చిన్నారుల కోసం వాటిని అందజేశారు. దాతలను మంగళగిరి ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి అభినందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అందె సునీత, కల్యాణి, సీత, పలువురు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

**మంగళగిరి టౌన్:** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మంగళగిరి నగర పరిధిలోని రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు కళావేదికలో ఈఎస్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో కార్మికులకు గుండె, చర్మ సంబంధిత వ్యాధులతో పాటు సాధారణ వ్యాధులకు సంబంధించి ఈఎస్ఐ హాస్పిటల్, కామినేని ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా మాట్లాడుతూ.. కార్మికుల సౌలభ్యం కోసం మూడు విడతలుగా వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, వైద్యనిపుణులు తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మె నోటీసులు అందజేత


ప్రధానోపాధ్యాయురాలికి సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

**మంగళగిరి టౌన్:** లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ దేశ వ్యాప్తంగా జూలై 9న సమ్మె నిర్వహించనున్నట్లు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా మంగళవారం సీకే హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలికి సార్వత్రిక సమ్మె నోటీసును వైఎస్సార్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అన్నారు. మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 9వ తేదీన స్వచ్ఛందంగా పాఠశాలలు, బ్యాంకులు, కళాశాలలు మూసివేయాలని వారు కోరారు. అనంతరం నగర పరిధిలోని పాఠశాలలకు, బ్యాంకులకు, కళాశాలలకు సమ్మె నోటీసులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు శ్రీనివాసరాజు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బి.జగన్, లక్ష్మణరావు

**లక్ష్మీపురం:** దేశవ్యాప్తంగా జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో గిగ్ వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర నాయకుడు బి.జగన్ పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమావేశం సీఐటీయూ నగర కార్యాలయంలో ఎస్. బ్రహ్మయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిగ్ వర్కర్స్‌కు కనీస ఆదాయం, ఉద్యోగ భద్రత, రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. లేబర్ కోడ్స్ వ్యతిరేకిస్తూ నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ మారుతున్న కాలంలో గిగ్ వర్కర్స్‌కు సమగ్ర చట్టం లేని కారణంగా భౌతిక దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటి నివారణకు సమగ్ర రక్షణ చట్టం ఏర్పాటుకు కర్ణాటక, రాజస్థాన్ తరహా గిగ్ వర్కర్స్ రక్షణ కోసం ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో బి.ఉదయ్, రానా, నరసింహారావు, విజయ్, సతీష్, రామారావు, వాల్మీకి, ఉమా మహేశ్వరరావు, వరప్రసాద్, మరియ బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

# డీవార్మింగ్ మందుల పంపిణీ రేపు

**ఫిరంగిపురం:** మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 26వ తేదీ నుంచి జూలై 10వ తేదీ వరకు గొర్రెలు, మేకల పెంపకం దారులకు నట్టల నివారణ మందు పంపిణీ చేయనున్నట్లు పశువైద్యాధికారి పీర్‌అహ్మద్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది వెళ్లి జీవాలకు నట్టల నివారణ మందులు తాగిస్తారన్నారు. దీని ద్వారా పేగు పురుగులను తొలగించవచ్చని చెప్పారు. పశువులు, మేకలు, గొర్రెలకు నట్టలనివారణ మందు తాగించడం ద్వారా జీవాల్లో ఎదుగుదల బాగుంటుందని తెలిపారు. రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. రక్తహీనత కూడా తొలగిపోతుందని పేర్కొన్నారు.

# తక్షణమే స్పందిస్తే ప్రాణ నష్టాన్ని తగ్గించగలం


కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకట్ దీపక్

**తాడేపల్లి రూరల్:** అనుకోని విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే స్పందిస్తే ప్రాణ నష్టాన్ని తగ్గించవచ్చని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట్ దీపక్ అన్నారు. మంగళవారం తాడేపల్లి పరిధిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో 'ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రి సంసిద్ధత'పై ఎయిమ్స్ వైద్యులు, ఆంధ్ర, తెలంగాణ, పుదుచ్చేరి, చత్తీస్‌గఢ్‌కు చెందిన 30 మంది వైద్యులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ దీపక్ మాట్లాడుతూ.. విపత్తుల ముందు, ఆ తరువాత అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులు, డాక్టర్లు విపత్తుల ప్రమాద తగ్గింపునకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మంగళగిరి ఎయిమ్స్‌లోని నిర్మాణాత్మక పరికరాలు, అనుభవం కలిగిన డాక్టర్లు, మెడిసిన్, టెస్టింగ్ పరికరాలు, బ్లడ్‌బ్యాంక్ వంటి ఇతర వివరాలను అందజేయాలని సూచించారు. సమావేశంలో ఎయిమ్స్ అడ్మినిస్ట్రేషన్ హెచ్ఓడీ డాక్టర్ రామమోహన్, డాక్టర్ రమ్యజ్యోతి, విపత్తుల సంస్థ అధికారులు ఆర్ఎస్ఐ మధుబాబు, జీఐఎస్ ఎక్స్‌పర్ట్ హరీష్, ప్రాజెక్ట్ మేనేజర్లు బస్వంత్, కిషోర్, సతీష్, పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

# 28న మానవ హక్కుల పరిరక్షణ సదస్సు

- 'చలో తెనాలి'కి ప్రజాసంఘాల పిలుపు
- అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శాంతకుమార్, వై.నేతాజీ, దళిత ప్రజా సంఘాల నేతలు

**లక్ష్మీపురం/నెహ్రూనగర్:** దళిత, ప్రజా సంఘాలు పిలుపు మేరకు మానవ హక్కుల పరిరక్షణ సదస్సు ఈ నెల 28న 'చలో తెనాలి' పేరుతో నిర్వహించనున్నట్లు ఇండియా లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శాంతకుమార్ తెలిపారు. స్థానిక లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాంతకుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్ మాట్లాడుతూ తెనాలిలో పోలీసులు దళిత మైనారిటీ యువకులపై అక్రమ కేసులు పెట్టి పోలీస్ స్టేషన్‌లో బహిరంగంగా దాడి చేసిన ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడిన తెనాలి–2 టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ రాములు నాయక్, తెనాలి–3 టౌన్ పోలీస్ స్టేషన్ రమేష్ బాబుల్‌తో కానిస్టేబుల్‌పై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. సమావేశంలో కేవీపీఎస్ నాయకులు బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ చిష్టీ, వీసీకే పార్టీ రాష్ట్ర నాయకులు జయసుధ, స్టాలిన్, భీమసేన సేవాదళ్ అధ్యక్షుడు నల్లపు నీలాంబరం, నాయకులు దేవరాజు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అనిల్, నాయకులు వినయ్ కుమార్, బీఎస్పీ నాయకులు చిరతనగుంట్ల వాసు, పౌర హక్కుల సంఘం నాయకులు శిఖా సురేష్ కుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని వినతి

**ఫిరంగిపురం:** కళాశాలలో తమ సమస్యలు పరిష్కరించాలని ఇమ్మి కాలేజీ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు సీఐ శివరామకృష్ణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. తమ కళాశాలలో కనీస వసతులు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. సరైన భోజన వసతి, మరుగుదొడ్లు, తాగునీరు సరిగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అధికారులకు సమస్యను తెలిపినా ఫలితం లేదని వారు వాపోయారు. పరీక్షల సమయంలో మరోప్రాంతానికి వెళ్లాలంటే వాహనం ఉన్నా సమకూర్చడం లేదని చెప్పారు. దీనిపై జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యలు తెలియజేస్తామన్నారు. స్పందించిన సీఐ శివరామకృష్ణ కళాశాల వద్దకు వచ్చి యాజమాన్యంతో మాట్లాడి సమస్యలు పరిష్కరించేలా చూస్తానని చెప్పారు. ఆయన వెంట ఎస్ఐ సురేష్, రైటర్ దాసు, సిబ్బంది ఉన్నారు.

# పొలం పిలుస్తోందిలో రైతులకు సూచనలు


కార్యక్రమంలో రైతులకు సలహాలు ఇస్తున్న అధికారులు

**పెదవడ్లపూడి (మంగళగిరి):** ప్రభుత్వం రైతులకు విత్తనాలలో రాయితీ ఇస్తుందని.. వాటిని రైతులు వినియోగించుకోవాలని లాం శాస్త్ర వేత్తలు రాజేష్, శ్రీలత కోరారు. పెదవడ్లపూడిలో మంగళగిరి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో వరి విత్తనాలను రాయితీపై అందజేస్తున్నామని.. రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏఓ రాజవంశీ, మండల వ్యవసాయ అధికారి శైలజారాణి, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఏఈవోలు వెంకయ్య, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

**దుగ్గిరాల:** మండలంలోని పేరుకలపూడి, ఈమని గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయబాబు మాట్లాడుతూ.. రైతులు కౌలు కార్డులు తీసుకోవడం ద్వారా పంట నష్టం వచ్చినప్పుడు బీమా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పి.శ్రీనివాస రావు, ఎంపీటీసీ సాయి చైతన్య, రైతులు వీఏఏలు కె.ప్రియాంక, డి.వంశీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బదిలీపై వెళుతున్న మండల వ్యవసాయ అధికారిని పి.శిరీషను ఘనంగా సత్కరించారు.

# అవుట్ సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి


నిరసన తెలుపుతున్న కార్మికులు

**నెహ్రూనగర్:** నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిచేసే ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతాలు పెంచాలని కోరుతూ చేపట్టిన సమ్మె మంగళవారానికి రెండో రోజుకు చేరింది. ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సంయుక్త కార్యదర్శి వేపూరి రవిశంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కార్మికులకు, డ్రైవర్లకు మాత్రమే జీతాలు పెంచిన విధంగానే ఇంజినీరింగ్ విభాగంలో రకరకాల పనులు చేసే కార్మికులకు కూడా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అవుట్ సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె గురించి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు విన్నవించినప్పటికి ఎటువంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కార్మికులకు సమస్యలను పట్టించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికులతో సీడీఎంఏ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాయపూడి కోటిబాబు, గాలి ఏసుబాబు, రమాదేవి, కోటేశ్వరమ్మ, అశోక్ పాల్గొన్నారు.

# అణచివేయాలని చూస్తే కుదరదు

**లక్ష్మీపురం:** అణచివేయాలని చూస్తున్న కొద్ది వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బలోపేతం అవుతున్నారని ఇది చరిత్ర చెబుతున్న వాస్తవమని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు (సంగం) మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చరిత్రకు వైఎస్ జగన్ అవసరం ఉంటే ఆయన్ను చరిత్రే బతికించుకుంటుందని చెప్పారు.

# ప్రతిభావంతులకు నిలయాలుగా ప్రభుత్వ పాఠశాలలు

**గుంటూరు ఎడ్యుకేషన్:** ప్రభుత్వ పాఠశాలలు ప్రతిభావంతులైన విద్యార్థులకు నిలయాలుగా మారాయని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను ఆయన మంగళవారం ఆర్జేడీ కార్యాలయంలోని తన చాంబర్‌లో అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు అన్ని రంగాల్లో పోటీ పడుతున్నారని, పాఠశాలల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులతో పాటు సుశిక్షితులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుబాటులో ఉందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకుని పేరు, ప్రఖ్యాతులు గడించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌కేబీఎం హైస్కూల్ నుంచి ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన పఠాన్ మొబీనా ఖాన్, ఎం. నవ్యరెడ్డి, షేక్ ఇమామున్నీసాను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాజావలి, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు, ఉపాధ్యాయులు పి.లలితబాబు, ఎం. శివన్నారాయణ పాల్గొన్నారు.

# క్రెడిట్ కార్డు నుంచి నగదు మాయం

**పట్నంబజారు:** క్రెడిట్ కార్డు నుంచి నగదు మాయమైన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. నెహ్రూనగర్ 9వలైనులో నివాసం ఉండే కె.రాఘవరావుకు ఆర్‌బీఎల్ క్రెడిట్ కార్డు ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ 6న అతడి క్రెడిట్ కార్డు నుండి రూ.49,320 వేరే సంస్థకు ట్రాన్స్‌ఫర్ అయినట్లు మెసేజ్ వచ్చింది. 1930 ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం కనబడలేదు. బాధితుడు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అలరించిన భక్తి సంగీత విభావరి

**నగరంపాలెం:** స్థానిక సంగడిగుంట మంత్రివారిబజార్‌లోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వర రాగ సుధా గుంటూరు ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి నిర్వహించారు. గాయకులు సాయిబాబాశర్మ, కృష్ణకుమారి బృందం ఆలపించిన భక్తి గీతాలు భక్తులను అలరించాయి. అనంతరం పుర వీధుల్లో స్వామి ఊరేగింపు వైభవంగా కొనసాగింది.